
# ప్రేమ-పిచ్చి

చంప

**ప్రేమికుల కొండ....**

**పేరుకే కొండ గాని నిజానికి ఒక రెండెకరాల దిబ్బ. దాని మీద పర్ణశాల లాంటి అందమైన హోటల్. ఆ హోటల్ చుట్టూ పెద్ద పెద్ద వృక్షాలు. వాటి కింద బల్లలు, కుర్చీలు, విశ్రాంతిగా కూర్చుని కబుర్లు చెప్పకుంటూ టిఫిన్ తింటున్న పర్యాటకులు. వారి భద్రత కోసం దిబ్బ చుట్టూ నిర్మించిన రెయిలింగ్. ఆ రెయిలింగ్ వద్ద నిలబడి కబుర్లు చెప్పకుంటున్న యువతీ యువకులు....**



కాస్త వంగి చూస్తే కొండ కింద నిర్మలమైన స్ఫటికజలంతో ప్రవహించే నది, ఆ నది కంటున్న కలల మాదిరిగా నీటి అద్దంలో ప్రతిఫలించే అవతలి ఒడ్డు పర్వతపంక్తి.

ప్రకృతి పరిచిన ఆ అందాల్ని పరవశంగా చూస్తూ నిలబడ్డ లిఖిత ముఖాన్ని తదేకంగా అరగంట నుంచి చూస్తుండి పోయాడు అభి. ముఖం మాత్రమే కనిపించేట్టు తల చుట్టు స్కార్ఫ్ కట్టుకుందామె. మేఘమాలికలో యిరుకున్న జున్ను చందమామ లాగా కనిపిస్తున్న ఆ ముఖాన్ని చూస్తుంటే అతని పెదవులు అదురుతున్నాయి. కళ్లు మెరిసి పోతున్నాయి. ఆ కళ్ల మెరుపుని అలవోకగా చూసిన లిఖి కింది పెదవిని మునిపంట నొక్కిపట్టి కవ్వింపుగా అడిగింది '' ఏమిటలా చూస్తున్నావ్''అని.

''తక్షణం 143 చెప్పేయాలనిపిస్తోంది'' అభిస్వరంలో కొంటెదనం.

'' చెప్పెయ్ మరి''లిఖి తీసిపోలేదు.

'' ఐ లవ్ యూ లిఖి!'' అన్నాడు తమకంగా.

ప్రేమికుల భాషలో దానికి సమాధానం 143. అంటే ఐ టూ లవ్ యూ! కాని ఆమె 142 అంది. అదేమిటో అర్థం కాలేదు అభికి.

'' ఐ నో ఇట్'' నవ్వేసింది లిఖి.

వారికి అటు, యిటు వున్న జంటలు కబుర్లు ఆపి కార్యరంగంలోకి దూకాయి. ఆ ముద్దులు, కౌగిలింతలు, కువకువలకు వీరి హృదయాలు వేగిర పడ్డాయి.

చటుక్కున ఆమెను దగ్గరగా లాక్కుని బిగి కౌగిట బంధించాడు అభి. ఆమె మొదట ఉలిక్కిపడినా తర్వాత తన చేతులతో అతనిని బిగించి మరింతగా హత్తుకుపోయింది. అతని పెదవులు ఆత్రంగా, వేడిగా, బలంగా ఆమె పెదవుల్ని అందుకున్నాయి. ఆ పెదవులకు ఆశ ఎక్కువ! సంతృప్తి లేదు. ఆమె చెక్కిలి మీద, మెడ మీద ముద్దులు కురిపించాయి.

వారి కళ్లు మూతలు పడుతున్నాయి. రక్తం హోరెత్తిపోతోంది. నరాలు తెగిపోతాయేమో అన్నంత ఉద్ధృతంగా చెలరేగుతున్న కాంక్ష.

అంతలో-

కాళ్ల కింద భూమి కుంగి పోయినట్టు భావన. అగాధంలోకి కూలిపోతున్నట్టు భయ విహ్వలత. కళ్లు మూసుకుపోయాయి. కెవ్వున కేక!

''అయ్యో, పడిపోతున్నారు... పడిపోతున్నారు!'' భయంభయంగా అరుపులు.

లిఖిత కళ్లు తెరిచేసరికి- చెట్టుకొమ్మల్లో చిక్కుకొని ఉందామె. భయంగా కిందకు చూసింది. అభి అగాధంలోకి జారిపడిపోతున్నాడు. కెవ్వున అరిచింది.

''లిఖి! లిఖి! ఏమయిందమ్మా, ఏమిటలా అరిచావ్? పీడకల గాని వచ్చిందా?'' అమ్మ అడుగుతోంది. లిఖితకు అయోమయంగా వుంది. ఏం జరిగింది? అసలేం జరిగింది? కళ్లు పెద్దవిగా చేసి దిగ్భ్రాంతి గా చుట్టూ చూసింది. తను ఉన్నది ప్రేమికుల కొండ మీద కాదు! స్వంత బెడ్ రూంలో!

★ ★ ★

రాత్రి పన్నెండు...

బెడ్ రూంలో ఒంటరిగా మంచం మీద అసహనంగా దొర్లుతోంది లిఖిత. ఆమెకు ప్రేమ జ్వరం! వారం రోజులుగా అభి కనిపించడం లేదు. బహుశా నాన్న ఏదో చేసి వుంటాడు. అయితే బెదిరింపులకు లొంగే ఘటం కాదు అభి. మరెందుకు కనిపించడం లేదు?

అంతలో గుప్పుమన్న సంపెంగి సువాసన. అతడు వాడే సెంట్. అతడు వచ్చేశాడు! వచ్చేశాడు! వారం రోజులు కనిపించకుండా దాగుడుమూతలాడి ఇప్పుడు అర్థరాత్రి నేరుగా తన బెడ్‌రూంకే వచ్చేశాడు.

ఒక్కసారిగా ఆమె హృదయం వెలిగిపోయింది. మనసు త్వరపడినా తమాయించుకుని ఏం చేస్తాడో చూద్దామని అటు తిరిగి కళ్లు మూసుకుంది.

ఒకటి.. రెండు.. మూడు..

క్షణాలు గడుస్తున్నాయి గాని ఏమి జరగలేదు. సంపెంగ వాసన ఆగి ఆగి వస్తోంది. అతడక్కడే వున్నాడని తన మనసు చెబుతోంది. కళ్లు తెరిస్తే తమాషా తేలిపోతుందని ఆమె ఊపిరి బిగబట్టి నిరీక్షిస్తోంది.

అంతలో తన మెడ మీద ఎవరో సన్నగా గాలి ఊదిన అనుభూతి! చక్కిలిగిలితో శరీరం రోమాంచమై ఇంక ఉగ్గబట్టలేక చటుక్కున లేచి '' రాస్కెల్! అదేం పనిరా! '' అంటూ అతనిని వాటేసుకుంది. '' ఒసే, రాక్షసీ! ఒదలవే!'' అంటూ మరింతగా హత్తుకుపోయాడు అభి. ప్రేమ ఉప్పొంగినపుడు ఒరేయ్, ఒసేయ్ అంటూ మెత్తగా తిట్టుకోవడం వారికో ముచ్చట!

హఠాత్తుగా కోపం వచ్చేసింది లిఖితకు. మూతి మూడు వంకర్లు తిప్పి- చాల్లే సరసం అంటూ సున్నితంగా నెట్టేసింది.

'' చాల్లే సరసం అంటే చాలదు అని అర్థం ట! ఒక అనుభవజ్ఞుడు చెప్పాడు'' అమాయకంగా ముఖం పెట్టాడు అభి.

ఆమె కిలకిల నవ్వేసింది. ఈ నవ్వు అతనిలో పులకింతలు రేపింది. ఆమెను దగ్గరగా తీసుకొని తను రాలేకపోయినందుకు కారణం విన్నవించుకున్నాడు.

''మీ నాన్న నన్ను రౌడీలతో కొట్టించి చంపాడు. కానీ నేను రతీమన్మథుల్ని వేడుకొని వారి చేత అశ్వనీ దేవతలకు రికమెండేషన్ చేయించి ప్రాణాలు పోయించుకుని వచ్చాను. అందుకే వారం రోజులు నీకు కనిపించలేదు. నేను ప్రాణాలతో వచ్చానంటే అది మన ప్రేమ మహిమ!''

అతడు జోక్ చేస్తున్నాడనుకొని నవ్వింది.'' రిస్క్ అని తెలిసినా నేరుగా నా గదికే వచ్చేశావా! ఎంత సాహసం'' ఆమె స్వరంలో ఆరాధన.

'' ఒక్కసారి చచ్చిన వాడిని! ఇంకా నాకు భయం ఏమిటి? ''చటుక్కున తన చేతితో అతని నోరు మూసేసి '' ఇంక అలాంటి చావు జోక్ లొద్దురా'' అని ఏడ్చేసింది లిఖిత.

ఆమెను అక్కున చేర్చుకుని వీపు నిమురుతూ కన్నీళ్లు తన పెదవులతో తుడిచి '' ఛ! జోక్! అంతే. ఏడేపెందుకు?'' అన్నాడు లాలనగా. నెమ్మదిగా అడుగులేస్తూ మంచాన్ని చేరుకున్నారు. మదన కథనానికి ఆహ్వానిస్తున్నట్లు ఆమె చేతులు చాపి మంచం మీద వాలింది.

తేనెలో ముంచిన చిట్టి చేగోడి లాంటి ఆమె నోటిని తన నోటితో మూసేసి మధువు ఆస్వాదిస్తూ ఆమెను ఆక్రమించుకున్నాడు. ఇద్దరిలో కార్చిచ్చులా రగులుతున్న కాంక్ష. తనివి తీరని తమకం. ఇంకా.. ఇంకా.. కావాలి. ఇంకా ఇంకా ఒకరిలో ఒకరు ఐక్యం అయిపోవాలి.. పెనుగులాట... కళ్లుమూతలు...

''లిఖీ! లిఖీ!... అమ్మాయ్ లిఖీ!'' అమ్మ కాబోలు తలుపు దబదబ బాదుతోంది. ఉలిక్కిపడి బట్టలు సవరించుకుని చుట్టూ చూసింది లిఖిత.

అభి లేడు!

తలుపు దబదబలకు జారుకున్నాడు కాబోలు.

ధైర్యంగా వెళ్లి తలుపు తెరిచింది లిఖిత.

★ ★ ★


కళ్లు తెరచి చూస్తే తను ఆస్పత్రి బెడ్ మీద ఉన్నట్లనిపించింది లిఖితకు. గాభరాగా లేచి గుమ్మం వద్ద కెళితే బయట బోల్టువేసి ఉందేమో, తలుపు తెరుచుకోలేదు. తనెందుకు ఆస్పత్రిగదిలో వున్నట్లు?

అరగంట ఆలోచనలతో గుంజుకున్నాక తలుపు తెరచి లోనికొచ్చింది నర్స్ మందులివ్వడానికి. లిఖిత ఎన్ని ప్రశ్నలడిగినా నర్స్‌ది ఒక్కటే సమాధానం '' డాక్టర్ ని అడగండి''

ఒక గంట గడిచాక డాక్టర్ వచ్చాడు. అతనితో బాటు అమ్మ, నాన్న. వాళ్లు గంభీరంగా వున్నారు. నన్నెందుకు ఆస్పత్రిలో పడేశారని అరిచింది లిఖిత. అమ్మ కన్నీళ్లు పెట్టుకుంది గాని చెప్పలేదు. నాన్న ముఖం దాచుకున్నాడు. దుర్మార్గులు!

★ ★ ★

ఉదయానే టిఫిన్ తిని, భార్య యిచ్చిన బైబై



కౌగిలి, చీర్స్ ముద్దులు అందుకుని డాక్టర్ దయ ఆస్పత్రికి బయలు దేరుతుండగా–

'' డాక్టర్! నాకు పిచ్చా? గద్దిస్తున్నట్టు అడిగిన స్వరం విని గుమ్మం వైపు చూసి ఆశ్చర్యపోయాడు. ఎదురుగా లిఖిత!

''కాపలాని తప్పించుకుని నేనిక్కడకు రాగలిగానంటే నా బుర్ర పని చేస్తున్నట్టే కదా! పిచ్చి లేనట్టే కదా! మరెందుకు నన్ను ఆస్పత్రిలో పెట్టి మందులు మింగిస్తున్నారు? ఆమె స్వరంలో కట్టలు తెంచుకున్న ఆగ్రహం.

ఆ అరుపులకు డాక్టర్ భార్య లత అక్కడికొచ్చి చూస్తుండిపోయింది. లిఖిత నేరుగా వెళ్ళి సోఫాలో కూర్చుని'' కాపలా వాళ్ళకి మస్కా కొట్టి నేనిక్కడకు వచ్చినట్లే మీడాయా వద్దకు వెళ్లగలను. పిచ్చి అని చెప్పి మీరు నన్ను అక్రమంగా గదిలో వుంచి మందులు మింగించి , నా తల్లిదండ్రుల నుంచి డబ్బులు గుంజుతున్నారని చెప్పగలను. నా మరణానికి మీరే కారణం అని చెప్పి టవర్ ఎక్కి దూకెయ్యగలను. ఐ డిమాండ్ ద ట్రూత్! చెప్పండి! నాకు పిచ్చా?'' ఆవేశంగా అడిగింది.

డాక్టర్ ఆలోచించాడు. నిజం చెప్పడమే మంచిదనిపించింది. ఎదుటి సోఫాలో కూర్చుంటూ ''పిచ్చి అనే మాట చుట్టు ఎన్నో అపార్థాలు గూడ గట్టుకొని వున్నాయి లిఖిత! చిన్న మానసిక రుగ్మతను కూడా పిచ్చి అనేసి మన వాళ్లూరికే భయపడి హంగామా చేస్తారు. నీకు పిచ్చి లేదు కాని కాస్త భ్రమకు లోనయ్యావు అంతే. ఆ భ్రమ మందుల తోనూ, కౌన్సిలింగ్‌తోనూ నయం అవుతుంది'' మృదువుగా చెప్పాడు.

''నాకు భ్రమా?'' అని దిగ్భ్రాంతి చెందింది లిఖిత.

''అవును, భ్రమే! పది రోజుల క్రితం ప్రేమికుల కొండ మీద, రెండు రోజుల క్రితం నీ బెడ్‌రూం లోనూ అభి నిన్ను కలిశాడని చెబుతున్నావ్. కాని రెండు వారాల క్రితమే అభి చనిపోయాడు!''

''డాక్టర్! '' భయవిహ్వలంగా అరిచింది లికిత. ఒణికిపోతోంది. శరీరం అంతా చెమట. కళ్లు పెద్దవి అయ్యాయి. జలపాతాల్లాగా కన్నీళ్లు.

ఆమెను అక్కున చేర్చుకుని సముదాయించింది లత. ఆమె ఏడ్చి, ఏడ్చి దుఃఖ భారం తీర్చుకున్నాక బాత్రూంకి తీసుకెళ్లి ముఖం కడిగింది. లిఖిత ఉపశమనం పొంది మళ్లీ డాక్టర్ ఎదురుగా కూర్చున్నాక టీ తెచ్చి యిచ్చింది లత.

టీ తాగి తేరుకుంది లిఖిత.నాన్న అభిని చంపించి వుంటాడని ఆమె అనుమానిస్తూనే వుంది. ఇప్పుడు రూఢీ అయింది. ఆమెలో ఏదో నిర్ణయం రూపు దిద్దుకొంటోంది.

కాసేపు ఎవరు మాట్లాడలేదు.

''డాక్టర్ మీరెవరినైనా ప్రేమించారా?'' హఠాత్తుగా అడిగింది లిఖిత. నవ్వేసి ఊరుకున్నాడు దయ. లత వైపు చూసిందామె.

''మాది ప్రేమ వివాహమే'' అంది లత సిగ్గు పడుతూ..

''మరి మీ వారు క్యాంప్‌కు వెళ్లినపుడు ఒంటరిగా వుండి ఆయన గురించి ఆలోచిస్తూ వున్నపుడు– ఆయన మీ ఎదురుగానే వున్నట్టు, ఆయనతో మాట్లాడుతున్నట్టు, పాటలు పాడుతూ డాన్స్ చేస్తున్నట్టు మీకెప్పుడు అనిపించలేదా? మధురో హల్లో తేలిపోలేదా?'' లతను కవ్వించింది లిఖిత.

''చాలా సార్లు!'' సగర్వంగా నవ్వేసింది లత, భర్త వైపు ఓరగా చూస్తూ.

''చూశారా డాక్టర్! మీ భార్య కూడా భ్రమలకు లోనైంది. మరి మీరామెను ఆస్పత్రిలో వుంచి మందులిచ్చారా?'' సూటిగా అడిగింది లిఖిత. తెలివైన ఘటమే అనుకున్నాడు దయ. కానీ సమాధానం చెప్పలేదు.

''భార్యకు దూరంగా వున్నప్పుడు మీరు కూడా అలాంటి భ్రమలకు లోనై వుంటారు కదూ!'' మృదువుగా అడిగింది లిఖిత. ఇబ్బందిగా ముఖం పెట్టాడు దయ. ''ఈ భ్రమలు సర్వసాధారణమే. కాలగతిలో భ్రమలు కరిగి పోతాయి అని మీకు తెలుసు. అయినా నాకు పిచ్చి అని బిల్డప్ యిచ్చారు, డబ్బు గుంజడానికే కదా!'' అని లిఖిత అంటుంటే, డాక్టర్ తల వాలిపోయింది.

''సరే. మా నాన్న నుంచి ఎంత డబ్బైనా గుంజండి. కాని నాకొక ఉపకారం చేయండి. పెళ్లి చేస్తే పిచ్చి నయమవుతుంది అంటారు. కాని మీరు మాత్రం– నాకు పెళ్లి చేస్తే పిచ్చి ముదురుతుందని మా నాన్నతో చెప్పండి. నాకు పెళ్లి వద్దు'' అంది లిఖిత.

అర్థం కానట్టు చూశాడు దయ.

''నాకు పెళ్లయితే అభికి ద్రోహం చేసినట్లే. పైగా నాకు మాంగల్యం కట్టే అమాయకుడి జీవితమూ నాశనమవుతుంది. నన్ను భ్రమల్లోనే వుండనివ్వండి. ఆ భ్రమలే నాకానందం'' అంటు తన గోడు వెలిబుచ్చుకుంది లిఖిత.

ఏం చెప్పాలో అర్థం కాలేదు దయకు.

''ఎడబాటు కలిగినపుడు భార్య మీ చెంతనే ఉన్నట్టు భ్రమించి మీరు ఆనందం పొందుతున్నారు. చిత్తుగా తాగేసి భ్రమల్లో ఆనందం వెదుక్కున్న దేవదాసు దేశానికే హీరో అయ్యాడు. అవి తప్పుకానప్పుడు నా భ్రమల్లో నేనుండటం తప్పెలా అవుతుంది, డాక్టర్? అదీ కాక, మా ప్రేమను చిద్రం చేసిన దుర్మార్గులు నా తల్లిదండ్రులు. వాళ్ల చేసిన తప్పుకు సజీవ శిక్షగా జీవితాంతం వాళ్ల కళ్ల ఎదుట నన్నిలానే వుండిపోనివ్వండి. అదే మీరు నాకు చేసే ఉపకారం'' అంది లిఖిత.

★ ★ ★

అర్ధరాత్రి... దూరంగా పెళ్లి పందిరి నుంచి వినిపిస్తున్న పాటలు–

ప్రేమా, పిచ్చి ఒకటే... ఓరోరి యోగి నన్ను కొరికెయ్‌రా... నన్ను నమిలెయ్ రా.. నమిలెయ్ రా... రగులుతోంది మొదలి పొద.. ష్..ష్..

మొదట పాటలు స్పష్టంగా వినిపించినా, తర్వాత అంతా గజిబిజి.. సన్నగా ప్రారంభమై క్రమంగా పెద్దగా ఆమె చెవిలో హోరెత్తిపోతూ...

ప్రేమ... పిచ్చి..పిచ్చి.. నమిలెయ్.. నలిపెయ్.. నలిపెయ్.. రగులుతోంది మొగలిపొద..ష్..ష్..

ఆ సంగీతానికి అనుగుణంగా మొదట మెల మెల్లగా.. తర్వాత.. ఉధృతంగా ఆమె ఒంటరి శరీరం జంట దొరికినట్టు ధనుస్సులాగా పైకీ, కిందకు చలిస్తోంది. ఆమె కళ్లలో విచిత్రమైన వెలుగు, ముఖంలో దివ్యానందం. ప్రియునితో సమాగమనమైనప్పుడు, ప్రేయసీ హృదయంలో ఉప్పొంగే దివ్యానుభూతులే ఆ వెలుగు, ఆనందం!

బయట తలుపు వద్ద చెవియొగ్గి వింటున్న అమ్మా, నాన్న. గదిలోని శబ్దాలు ఉధృతంగా వినిపిస్తోంటే, విషణ్ణమయిన హృదయాలు, విషాదం కమ్ముకున్న ముఖాలు.

★

